సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 14 । ఆగస్టు । 2025



భర్త మద్యం మానలేదని బలవన్మరణం

భర్త మద్యం అలవాటును మార్చలేక.. తన వాళ్ల ముందు తలెత్తుకోలేక.. మనస్థాపంతో రత్నమ్మ అనే మహిళ తనువు చాలించింది. - 8లో



టీడీపీ నేతల బాహాబాహీ

సామాజిక తనిఖీ బహిరంగ సభా ప్రాంగణంలో టీడీపీలోని రెండు వర్గాలు సభా ప్రాంగణం వద్దనే బాహాబాహీకి దిగాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.530
రెండోరకం	రూ.280	రూ.410

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 150 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీగా యువరాజ్



యువరాజ్‌కు నియామకం పత్రం అందజేస్తున్న ద్వారకనాథ్

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్(వీసీ)గా ప్రొఫెసర్ యువరాజ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ నాదెళ్ల విజయ భాస్కర్ చౌదరి బుధవారం పేర్కొన్నారు.యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్. ద్వారకనాథ్ యువరాజ్‌కు నియామక ఉత్తర్వును అందజేశారు.

అడ్మిషన్ల కోసం అదనపు నోటిఫికేషన్

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో అడ్మిషన్ల కోసం అదనపు నోటిఫికేషన్ ప్రభుత్వం ఇచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల అర్హత నిర్ధారణ ఈ నెల 21న, లాటరీ ఫలితాల ప్రకటన 25వ తేదీన, పాఠశాలల్లో అడ్మిషన్లు ఖరారు చేయడం ఈ నెల 31న ఉంటుందన్నారు.

రేపు మాంసం విక్రయం నిషేధం

రాజంపేట : రాజంపేటలో ఆగస్టు 15న మాంసం విక్రయాలు, జంతువధ నిషేధం అమలులో ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్‌ల్లో మాంసం అమ్మరాదన్నారు. ఈ నియమాలు అతిక్రమించిన వారిపై భారీ జరిమానా విధించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

17న బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జట్టుకు బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో బాల, బాలికలు, సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళల ఎంపికలు ఉంటాయన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 29 నుంచి మూడు రోజుల పాటు ప్రకాశంజిల్లా చేవూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9490181104, 7036907303 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

'పింఛా'లో పెరిగిన నీటిమట్టం



పింఛా ప్రాజెక్టులో చేరిన వరదనీరు

సుండుపల్లె : గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది.బుధవారం సాయంత్రానికి 258 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరగా ప్రస్తుతం 996.6 అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో మొత్తం నీరు 81.74 శాతంగా ఉందని జలవనరుల శాఖ ఏఈఈ నాగేంద్రనాయక్ తెలిపారు. ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదల కారణంగా ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని, ఏ సమయంలోనైనా గేట్లు ఎత్తుతారని, అందువల్ల ప్రాజెక్టుకు దిగువ ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

కడప సెవెన్‌రోడ్స్ : పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వైఎస్సార్ కడపజిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి బుధవారం సాయంత్రం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జేసీ అదితి సింగ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన బ్యాలెట్ బాక్సులను అత్యంత సురక్షితంగా భద్రపరచామన్నారు. వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే సిబ్బందిని ఏర్పాటు చేసి మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లను నియమించి కౌంటింగ్ పై వారికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రౌండ్ల వారీగా కౌంటింగ్ సమాచారం కోసం మీడియా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు.

ఓటుకూ వెన్నుపోటే!

సీఎంఓ డైరెక్షన్.. పచ్చ నేతల ఫుల్ యాక్షన్!

- పులివెందులలో గెలుపుకోసం అడ్డదారి
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండానే పోలింగ్



తమ ఓట్లు గల్లంతయ్యాయంటూ పులివెందులలోని కనుమపల్లె ఎస్టీ కాలనీ ప్రజల నిరసన

సాక్షి ప్రతినిధి, కడప : రాజ్యాంగానికి తూట్లు పొడవంలో.. ప్రజాస్వామ్యాన్ని చెరబట్టడంలో కూటమి నేతలు పూర్తిగా విజయం సాధించారు. సీఎంఓ డైరెక్షన్‌లో.. బందూక్ రాజ్యంలో.. పచ్చ బందిపోట్లు రెచ్చిపోయారు. బూతుల్లో పడి రిగ్గింగ్ చేయడంలో సక్సెస్ అయ్యారు. దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన 'ఓటుకూ' వెన్నుపోటు పొడిచి 'వెన్నుపోటుకు తాను బ్రాండ్ అంబాసిడర్‌'నని బాబు మరోసారి రుజువు చేశారు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుంది తెలుగుదేశం పార్టీ తీరు. అల్లరి మూకలతో అరాచకాలకు తెరలేపి.. ప్రజాస్వామ్యాన్ని పట్ట పగలే ఖూనీ చేశారు. ఒక చిన్న జెడ్పీటీసీ ఎన్నికలో రిగ్గింగ్ చేసుకుని విజయం సాధించాం అని చెప్పుకునేందుకు చేయని అకృత్యాలు లేవు.

పులివెందుల...ఈ పేరు చెబితేనే పచ్చ పార్టీకి ముచ్చెమటలు పడతాయి. అందులోనూ వైఎస్ అనే రెండక్షరాలను వింటే వారి ఒంట్లో వణుకు పుడుతుంది. ఆ వణుకును కప్పి పుచ్చుకునేందుకు స్థానికంగా ఉన్న కూటమి నేతలు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ డైరెక్షన్‌లో పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో సక్సెస్‌ఫుల్ యాక్షన్ పూర్తి చేశారు. రాష్ట్రంలో ఎన్నో జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా, పులివెందుల, ఒంటిమిట్ట మాత్రమే ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పించారు. ప్రజాబలం లేక అధికార బలంతో దాష్టీకాలకు దిగి 'పులివెందులలో మేమూ ఓసారి గెలిచాం' అని చెప్పుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. వైఎస్ అనే పేరును ప్రజల మనసుల్లోంచి చెరిపేయాలని వారు చేయని ఆకృత్యమంటూ లేదు. అయినా ప్రజలు వైఎస్ అనే పేరు వెనుకే ఉండటంతో చేసేదేమీ లేక రక్తపాతానికి దిగి రణరంగాన్ని సష్టించారు. సైదాపురం సురేష్‌రెడ్డి(చంటి), అమరేష్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలపై వరుసగా హత్యాయత్నం ఘటలకు పాల్పడ్డారు. నామినేషన్ల రోజు నుంచీ ఆ పార్టీ నేతలు చేసిన ఆగడాలు, పోలింగ్ రోజుకు మరీ మితిమీరిపోయాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న ఓటు హక్కును సైతం కాలరాశారు.ఎన్నికల కమిషన్ కళ్లుండీ చూడలేని గాంధారీ పాత్రను పోషించింది.

- వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి నేతలు దాడులకు తెగబడ్డారు. వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం ఘటన సంచలనంగా మారింది. ఒక్కమారుగా భయోత్పాతం సృష్టించారు. పైగా పోలీసులు ద్వారా కనిపించిన వారిని కనిపించినట్లు కేసులు పెట్టి జైళ్లకు పంపడం తొలి ఎత్తైతే...పోలింగ్ నాడు బూత్‌లను ఆక్రమించుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలు అంతా కలిసి ప్రజాస్వామ్యాన్నే చెరబట్టారు. ఎన్నికల కమిషన్ అందుకు ఒత్తాసు పలికింది. ప్రజల్ని పోలింగ్ బూత్‌లోకి కూడా రానివ్వకుండానే జమ్మలమడుగు, కమలాపురంతో పాటు జిల్లాలోని టీడీపీ క్యాడర్ అంతా బాహాటంగా దొంగ ఓట్లు వేసుకున్నారు. చివరికి తన సమక్షంలోనే దొంగ ఓట్లు వేస్తున్నా కలెక్టర్ ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఇది ప్రజాస్వామ్యం కాదు, మళ్లీ బైపోల్ నిర్వహించండని వైఎస్సార్‌సీపీ కోరితే, తూచ్ అలాంటిదేమీ కుదరదంటూ ఎన్నికల కమిషన్ చేతులెత్తేసింది. మరీ ఇంత దారుణంగా అరాచకాలు చేస్తారా అని రేపు కోర్టులు ప్రశ్నిస్తాయేమోనని భయపడి పథకం ప్రకారం బుధవారం రెండు పోలింగ్ బూత్‌లలో నామ్‌కేవాస్తే రీపోలింగ్ నిర్వహించారు. దాన్ని వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. ఎట్టి పరిస్థితుల్లో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరా ఫుటేజ్ బయట పెట్టి, దొంగ ఓట్లు వేసినవారందరినీ గుర్తించి ఎన్నిక రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. వ్యవస్థలను ఎలా వాడుకోవాలో సీఎం చంద్రబాబుకు తెలినంతగా ఎవరికీ తెలియదని మరో మారు నిరూపించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. టీడీపీ ఆకత్యాలపై తప్పకుండా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేస్తోంది. కాగా, సీఎంఓ డైరెక్షన్‌ను సక్సెస్‌ఫుల్‌గా క్షేత్రస్థాయిలో కూటమి నేతలు, వ్యవస్థలు యాక్షన్ చేశాయని నిపుణులు వివరిస్తున్నారు.

ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు జరగలేదు



నేను 30 ఏళ్లుగా ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు జరగలేదు. అందుకే మా కొత్తపల్లి హరిజనవాడలోని ఓటర్లందం బాయ్ కాట్ చేస్తున్నాం. ఉదయం 6 గంటల నుంచి టీడీపీ గుండాలు బూతులు వద్దకు చేరుకున్నారు. బూతు దగ్గరికి వెళ్లగానే మా దగ్గర ఉన్న స్లిప్పులు లాక్కుంటున్నారు. మీరు వెళ్లిపోండి మీ ఓటు మేమే వేస్తాం అని అంటున్నారు. మా ఓటును కూడా మేము వేసుకునే పరిస్థితిలో లేము. ఇలాంటి సంస్కృతి కూటమి నేతలు మార్చుకోవాలి.

– గోవిందమ్మ, ఇ –కొత్తపల్లె, పులివెందుల

అంతా పథకం ప్రకారమే!

- టీడీపీ వర్గాలు యథేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకోని పోలీసులు
- పోలింగ్ బూత్‌లోకి మంత్రి వెళుతున్నా అడ్డుకోలేకపోయిన అధికారులు
- అధికార పార్టీ నేతలకు ఒక రూలు.. వైఎస్సార్ సీపీ నాయకులకు మరో రూలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అనుకున్న ప్రకారమే అంతా అయింది.. ముందస్తు ప్రణాళిక వేసుకుని అంతా పథకం ప్రకారమే పూర్తి చేశారు. టీడీపీ యథేచ్ఛగా బూతుల్లో చొరబడుతున్నా పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందే తప్ప ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు అయితే ఒక రూలు...అధికార పార్టీ నేతలకు మరో రూలు అన్నట్లు నడిచింది. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి బూతుల్లోకి వెళ్లి వైఎస్సార్ సీపీ ఏజెంట్లను విచక్షణా రహితంగా కొడుతున్నా అడ్డుచెప్పిన అధికారి లేరంటే నమ్మి తీరాల్సిందే. ముందస్తు వ్యూహం ప్రకారమే రెండు, మూడు గంటలు సాధారణ పోలింగ్‌కు అవకాశం ఇచ్చి... తర్వాత అంతా టీడీపీ గుండాలు బూతులను ఆక్రమించుకుని సైక్లింగ్‌కు తెర తీశారు. ఎప్పుడూ చూడని వారు...ఎన్నడూ కనిపించని వారు వచ్చి ఓట్లు వేస్తుంటే గ్రామస్తులు బూతు పురాణం అందుకున్నా, కనీసం చలనం లేకుండా టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేసుకున్నారు. ఇదేమని అడిగే అధికారి లేడు..చేస్తున్నది తప్పు అని చెప్పే పోలీసులు లేకపోవడంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో దమనకాండ కొనసాగింది.

ఆధ్యాత్మిక క్షేత్రంలో కొత్త సంప్రదాయం

జిల్లాలోని ఒంటిమిట్ట క్షేత్రం ఆధ్యాత్మికంగా అలరారుతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ వస్తోంది. టీటీడీ ఆధ్వర్యంలో నిత్యం పూజా కార్యక్రమాలతో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్న చోట అలజడి కొనసాగింది. ఎప్పుడూ చూడని...దాడులు, దౌర్జన్యాలతో మంత్రితోపాటు అనుచరగణం మండలమంతా తిరుగుతూ బూతులను ఆక్రమించుకుని రిగ్గింగ్ చేస్తూ కొత్త సంప్రదాయానికి తెర తీశారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై మంత్రి సమక్షంలోనే దాడులు చేసి బయటికి పంపడం, లోప తమ కార్యకలాపాలు కొనసాగించడం కనిపించింది. అక్కడికి మంటపంపల్లె, సాలాబాద్, చిన్నకొత్తపల్లెల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు ఎదురుపడిన సందర్భంలో ఇది పద్ధతి కాదు...మంత్రి గారూ అంటూ తెలియజేశారు. అయినా ముందుకు వెళుతూ ఎక్కడికక్కడ బూతుల్లో తమ పని తాము చేసుకుపోయారు.

రీపోలింగ్ జరపాలి...కౌంటింగ్ వాయిదా వేయాలి

జిల్లాలోని ఒంటిమిట్ట జెడ్పీటీసీ పరిధిలో అక్రమాలు జరిగాయని....టీడీపీ నేతలతో పాటు స్వయంగా రాష్ట్ర మంత్రే బూతుల్లోకి వెళ్లి దౌర్జన్యం చేసి దొంగ ఓట్లు వేయించుకున్న నేపథ్యంలో అన్నిచోట్ల రీపోలింగ్ నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.ఈమేరకు పార్టీ అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డిలు డిమాండ్ చేస్తున్నారు. ఓట్ల అక్రమాలతోపాటు గ్రామాల్లో ఓటర్లను వేయనీయకుండా చేయడం, బూతుల్లో దౌర్జన్యాలు, రిగ్గింగ్ తదితర వాటిని పరిగణలోకి తీసుకుని రీ పోలింగ్‌నిర్వహించడంతోపాటు గురువారం జరిగే కౌంటింగ్‌ను కూడా వాయిదా వేయాలని వారు ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నిక గురించి ఆయనతో చర్చించారు. ఇంతటి ఘోరమైన ఎన్నికలు తమ జీవితంలో చూడలేదన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ప్రతి బూత్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ సమక్షంలో ఆయన మనుషులు రిగ్గింగ్ చేశారని తెలిపారు. ఇక్కడ జరిగిన దౌర్జన్యాలు, అక్రమాల గురించి మాజీ సీఎంకు వివరించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట వైఎస్సార్ సిప మండల అధ్యక్షులు టక్కోలు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ అభ్యర్థి సుబ్బారెడ్డి తదితరులు

నిత్యపూజ స్వామికి రూ. 1,38,003 ఆదాయం

సిద్దవటం : వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం లెక్కించారు. బుధవారం ఆలయ ఇన్‌చార్జి ఈఓ శ్రీధర్ మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించగా రూ. 1,38,003 వచ్చిందని తెలిపారు.కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ ఉద్యోగి చంద్ర, అర్చకులు సుబ్రమణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాటమరాజు స్థల పట్టాను రద్దు చేయండి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

గాలివీడు : కొన్ని వందల సంవత్సరాలుగా గ్రామ ప్రజలందరూ సంక్రాంతి రోజున కాటమరాజు దగ్గర చిట్లాకుప్ప వేసుకొని పశువులను బెదిరిస్తూ పండగ చేసుకుంటూ వస్తున్నారని, ఈ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తి పట్టా చేసుకొని చుట్టూ కంచె వేశాడని, ఈ స్థలానికి సంబంధించి డీకేటీ పట్టాను రద్దుచేసి గ్రామ ప్రయోజనాల కోసం కాటమరాజు ఉత్సవానికి కేటాయించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తహసీల్దార్ భాగ్యలతకు సూచించారు. నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లెకు సమీపంలో ఉన్న స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తి డీకేటీ పట్టా చేయించుకుని దాని చుట్టూ కంచె వేసిన విషయాన్ని గ్రామ ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ కాటంరాజు స్థలాన్ని పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కాటమరాజు స్థలాన్ని ఆక్రమించుకున్న కుటుంబ సభ్యులకు ఎన్ని ఎకరాల వరకు డీకేటీ పట్టా ఉంది.. ఎంతమంది పేర్ల మీద డీకేటీ ఉంది



తహసీల్దార్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. వెంటనే కాటమరాజు స్థలాన్ని ఆక్రమించుకొన్న డీకేటీ పట్టాను రద్దు చేయడానికి తగిన ప్రతిపాదనలు తమకు పంపాలని తహసీల్దార్‌కు తెలియజేశారు. గుడి స్థలాలను కబ్జా చేసేవారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.కాటమరాజు స్థల వివాదం విషయం తమ దృష్టికి వచ్చిందని. ఇరుపక్షాలతో మాట్లాడి కాటంరాజు ఉత్సవాన్ని జరుపుకోవడానికి స్థలం ఇవ్వాలని తాను కూడా వారికి తెలియజేసినట్లు తహసీల్దార్ భాగ్యలత కలెక్టర్‌కు విన్నవించారు.

ఆధునిక బోధనా పద్ధతులు తప్పనిసరి

రాయచోటి : అంగన్‌వాడీ సెంటర్లలో ఈసీసీ కార్యక్రమాల ద్వారా పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించడం అవసరమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం అమరావతి నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి అంగన్‌వాడీ సెంటర్లలో ఈసీసీ కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్‌తోపాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని,వారిభవిష్యత్తుకు ఇది బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.

జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలోని 2275 అంగన్ వాడీ కేంద్రాల్లో 35248 మంది పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యను అందిస్తున్నామని వివరించారు. తంబళ్లపల్లిలో అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి మూవబుల్ గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు.

మూడు ముక్కలాట?

- మదనపల్లె చైర్మన్ పదవికి ఎమ్మెల్యే పంపిన పేరు రహస్యం
- జనసేన తరఫునా పేర్లతో కమిటీకి సిఫార్సు
- బీజేపీ వర్గీయులకు డైరెక్టర్ పోస్టులు
- తానే చైర్మన్ అంటూ అధికారులపై ఓ నేత పెత్తనం



మదనపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు



మదనపల్లె: కూటమి ప్రభుత్వ ప్రభావమో, స్థానిక రాజకీయ వర్గపోరు వల్లనో కాని మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి చాలామంది పోటీ పడుతున్నారు. ఇక్కడి పరిస్థితులు మూడు పార్టీల మధ్య చైర్మన్ పదవి మూడు ముక్కలాటగా మారింది. ఎవరికి వారు చైర్మన్, కమిటీ డైరెక్టర్ల పదవులకు జాబితాలు తమ నేతల ద్వారా సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన స్థానిక టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్‌ది కీలకపాత్ర ఉంటుంది. చైర్మన్ పదవికి ఎవరి పేరు సిఫార్సు చేశారో ఆయన మనసులోని మర్మం బయట పెట్టడం లేదు. దీనికి స్థానిక రాజకీయ పరిస్థితులే కారణమని చెబుతున్నారు.

ఎమ్మెల్యే మర్మం రహస్యం

మదనపల్లె మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా ఎమ్మెల్యే షాజహాన్ ఒకరి పేరును సిఫార్సు చేశారని, ఆ పేరు గుర్తులేదని మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అంటే ఎమ్మెల్యే సిఫార్సు చేసిన ఆ నేత పేరు బయటకు రాకపోవడం బట్టి చూస్తే కూటమి పార్టీలు అప్రమత్తం అవుతాయని, లేదంటే వ్యతిరేకత వస్తుందని రహస్యంగా ఉంచారని భావిస్తున్నారు. ఇది వర్గపోరు మరింత తీవ్రత పెంచితే తలనొప్పి తప్పదని జాగ్రత్తలు తీసుకుని ఉండొచ్చు. ఎలా ఉన్నప్పటికీ ఈ వ్యవహారం కిందిస్థాయి మార్కెటింగ్‌శాఖ అధికారులు తమకు తెలియదని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేర్లు బహిరంగం కాకూడదన్న ఆలోచనతో ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే కమిటీ చైర్మన్‌గా ఎవరున్నా దానికి గౌరవ చైర్మన్ ఎమ్మెల్యేనే కాబట్టి అధికారాలన్నీ ఆయనే చెలాయించే అవకాశం లేకపోలేదు. ఎమ్మెల్యే ఆదేశాలను అధికారులు దిక్కరించి వ్యవహరించే పరిస్థితి ఉండదు కనుక..ఎమ్మెల్యే కూటమి పార్టీల తీరును గమనించేందుకు ఆ పేరును రహస్యంగా ఉంచారేమో అని పార్టీ వర్గాల్లో చర్చించుకొంటున్నారు.

జనసేన కమిటీ సిఫార్సు

స్థానిక జనసేన నేత చైర్మన్, డైరెక్టర్ల పేర్లతో కమిటీకి సిఫార్సు చేశారు. జనసేన మంత్రి, టీడీపీకి చెందిన ఓ మంత్రి ద్వారా తాను సిఫార్సు చేసిన కమిటీకి ఆమోదం లభించేలా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇది ఎమ్మెల్యే సిఫార్సు చేసిన కమిటీకి పోటీగా సిఫార్సు చేసినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో కూటమి పార్టీల మధ్య పోటీ నెలకొన్నట్టే. అయితే ఎమ్మెల్యే సిఫార్సుకు ఆమోదం లభిస్తుందా లేక జనసేన కమిటీకి పదవులు లభిస్తాయా అన్నది చర్చనీయాంశమైంది. అధికారంలోని రెండుపార్టీల మధ్య పోటీ నెలకొన్నట్టు తెలుస్తోంది. కాగా కమిటీలో డైరెక్టర్ పదవుల కోసం బీజేపీకి చెందిన కొందరి నుంచి వారి వ్యక్తిగత వివరాలను సేకరించారు. కొందరి పేర్లను సిఫార్సు చేశారని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీకి వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేనే చైర్మన్..

నేనే మార్కెట్ చైర్మన్ అంటూ ఓ స్థానిక నేత తమపై పెత్తనం చెలాయించడం పట్ల మార్కెటింగ్ అధికారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మదనపల్లె మార్కెట్ చైర్మన్ పదవిని కలెక్టర్ శ్రీధర్ జనరల్ మహిళకు కేటాయిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ప్రభుత్వం ఇంతవరకు చైర్మన్‌ను నియమిస్తూ ఉత్తర్వు జారీచేయలేదు. అయితే ఆ నాయకుడు మార్కెట్ యార్డులో పరిస్థితుల గురించి అదేమైంది, ఇదేమైంది, నేను బాధ్యతలు చేపట్టే వరకు ఏపని చేయొద్దు అంటూ హుకుం జారీ చేయడంపై అధికారులు విస్తుపోతున్నారు.

తమ్ముళ్ల తికమక

కూటమి పార్టీల మధ్య మార్కెట్ కమిటీ వ్యవహారం రసవత్తరంగా మారడంతో టీడీపీ తమ్ముళ్లు తికమక పడుతున్నారు. పదవులను పొందడం కోసం ఎదురుచూస్తున్నారు. పొరుగు నియోజకవర్గాల్లో నామినేటెడ్, సింగిల్‌విండో త్రీమెన్ కమిటీలు భర్తీ చేస్తుంటే.. మదనపల్లెలో ఇవేమిలేక నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీలోనైనా పదవులు పొందాలనుకుంటే కూటమి పార్టీల మధ్య పోటీతో తమ్ముళ్లు ఉసూరుమంటున్నారు. కనీసం పార్టీ పదవులనైనా దక్కుతాయంటే అవీ ఎండమావిగానే కనిపిస్తున్నాయని నిట్టూరుస్తున్నాయి. వర్గాల మధ్య పోరుతో ఎవరికి ఏ పదవి ఇస్తారో లేక ఇవ్వరో అని ఆశలు వదులుకుంటున్నారు.

రాజంపేట ఎంపీపీగా రమణమ్మ



రమణమ్మకు ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి నరసింహమూర్తి

రాజంపేట టౌన్ : రాజంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) మండలంలోని తుమ్మల అగ్రహారానికి చెందిన ఆరెళ్ళ రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపీపీగా ఉన్న వై.వెంకట నారాయణ మృతి చెందడంతో ఆ పదవి ఖాళీ ఏర్పడింది. దీంతో అధికారులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించారు. ఈ నేపథ్యంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కూచివారిపల్లె-2 ఎంపీటీసీగా ఎన్నికైన ఆరెళ్ళ రమణమ్మ ఎంపీపీ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. రమణమ్మ అభ్యర్థిత్వాన్ని ఆర్.బుడుగుంటపల్లె ఎంపీటీసీ, మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి ప్రతిపాదించగా తాళ్ళపాక ఎంపీటీసీ డి.మధుసూదన్‌వర్మ బలపరిచారు. రాజంపేట మండలంలో మొత్తం 16 ఎంపీటీసీలకు ఇద్దరు మృతి చెందారు. దీంతో 14 మంది ఎన్నికలో పాల్గొని రమణమ్మను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజనల్ డెలప్‌మెంట్ ఆఫీసర్ నరసింహమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ పగడాల వరప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఆరెళ్ల రమణమ్మ విలేకరులతో మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈసందర్భంగా ఎంపీటీసీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

మత్తుకు బానిసలైతే భవిష్యత్తు నాశనమే


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటి టౌన్ : మత్తుకు బానిసైతే మీ భవిష్యత్తు నాశనమవుతుందని పోలీసు అధికారులు విద్యార్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నషా ముక్త్ భారత్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలసి మత్తుకు బానిసలం కాము అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరం యువత మత్తుకు బానిసగా మారి హత్యలు, నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లారీలు ఢీకొని ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

మదనపల్లె రూరల్ : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. కుప్పం వడ్డిపల్లెకు చెందిన డ్రైవర్ నారాయణస్వామి(30) టెంపోలో మదనపల్లె టమాటా మార్కెట్‌కు బయలుదేరాడు. హైదరాబాదుకు చెందిన వెంకటదుర్గారావు(45) లారీలో పలమనేరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని 150వ మైలువద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీల్లోని ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు యత్నించిన గర్భిణి పావని

మదనపల్లె రూరల్ : గర్భిణి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన బుధవారం పీటీయం మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పీటీఎం మండలం టి.సదుంకు చెందిన శ్రీకాంత్ భార్య పావని(27) ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా భర్త కొంతకాలంగా తనను, బిడ్డను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పీటీయం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చనిపోయిన వాళ్లు ఉపాధి హామీ పనులు చేశారు

- గోకులం బిల్లుల్లో గోల్‌మాల్
- ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూలీలే
- రూ.2,39,372 రికవరీకి ఆదేశం



సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

గుర్రంకొండ : నాలుగేళ్ల క్రితం చనిపోయిన వాళ్లు ఉపాధిహామీ పనులు చేశారు. గోకులం షెడ్ల నిర్మాణంలో మంజూరైన బిల్లుల్లో అవకతవకలు జరిగాయి. ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉపాధి హామీ కూలీలుగా పనిచేసి బిల్లులు చేసుకొన్నారు. ఇవన్నీ గుర్రంకొండ మండలంలో ఏడాదిగా జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన వింతలు, విశేషాలు. దీనికి సంబంధించి ఒక టెక్నికల్ అసిస్టెంట్, ఒక ఫీల్డ్ అసిస్టెంట్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఉపాధిహామీ అక్రమాల్లో మొత్తం రూ. 2,39,372 అవినీతి జరిగినటు అధికారులు లెక్కలు తేల్చి ఎనిమిది పనులపై విచారణకు ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

గుర్రంకొండలోని ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బహిరంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2024–25 ఏడాదికి సంబంధించి మొత్తం రూ.5.50 కోట్లు ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు. ఇందులో కూలీలకు వేతనాల కింద రూ.4.30 కోట్లు, మెటీరియల్ చెల్లింపుల కింద రూ. 1.20 చెల్లించామన్నారు. గ్రామాల వారీగా ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిని చదివి వినిపించారు.

- సరిమడుగులో 2021లో చనిపోయిన ఓ వ్యక్తి 2024లో పనిచేసినట్లు మస్టర్లలో చూపించి బిల్లు డ్రా చేసుకొన్నారు. ఇదే పంచాయతీలో చిన్న రమణ అనే వ్యక్తి 2023లో చనిపోగా ప్రస్తుతం అతను వారం రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసినట్లు రికార్డుల్లో చూపించి బిల్లులు డ్రా చేసుకొన్నారు.
- గుర్రంకొండ, సరిమడుగు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, బెంగుళూరులో ఉద్యోగం చేసుకొనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉపాధి హామీ పనులు చేసినట్లు చూపించి బిల్లులు డ్రా చేసుకొన్నట్లు విచారణలో తేలింది.
- శెట్టివారిపల్లె, టి.రాచపల్లె, సరిమడుగు గ్రామాల్లో ఒకరి పేరుమీద మంజూరైన షెడ్లు బినామీ వ్యక్తులు నిర్మించుకొని బిల్లులు చేసుకొన్నట్లు విచారణలో తేలింది.
- టి.రాచపల్లెలో గోకులం షెడ్ల బిల్లుల మంజూరు కోసం ఉపాధిహామీ సిబ్బంది రైతుల దగ్గర నుంచి రూ.20 వేలు లంచం వసూలు చేసినట్లు విచారణలో తేలినట్లు అధికారులు తెలిపారు.
- పదిగ్రామాల్లో బినామీ పేర్లతో మస్టర్లలో ఒకరే ఫోర్జరీ సంతకాలు చేసి లక్షలాది రూపాయల నిధులు డ్రా చేసుకొన్నారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్లు, వారి కుటుంబ సభ్యులు పనులు చేయకపోయినా వారి పేర్లు మస్టర్లలో నమోదు చేసుకొని బిల్లులు డ్రా చేసుకొన్నట్లు అధికారులు ప్రకటించారు.
- రెండు గ్రామాల్లో ఫారంఫాండ్ పనులు చేయకపోయినా ఉపాధిహామీ సిబ్బంది బినామీ పేర్లతో మస్టర్లు వేసుకొని బిల్లులు డ్రా చేసుకొన్నారు.
- మస్టర్లలో కూలీల సంతకాలను కొంతమంది నాయకులు ఫోర్జరీ చేసి బిల్లులు డ్రా చేసుకొన్నారు.
- గుర్రంకొండ, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో హౌసింగ్ బిల్లులను లబ్దిదారుల పేరుమీద కాకుండా బినామీ వ్యక్తుల పేర్లతో బిల్లులు చేసుకొన్నారు.
- వీటికి సంబంధించి ఉపాధిహామీ సిబ్బందికి రూ. 7 వేలు జరిమానా విధించారు. కాగా ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాల్లో రూ. 2,39,372 అవినీతి జరిగినట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి సరిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్ పూజిత, టెక్నికల్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రాజులను సస్పెండ్ చేసినట్లు పీడీ వెంకటరత్నం తెలిపారు. మండంలో వివాదాస్పదంగా మారిన ఎనిమిది పనులపై ఎంపీడీవో, ఏపీడీలతో విచారణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు ఈ కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు, ఏఓ బ్రహ్మానందరెడ్డి, ఏపీవో జయరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎంఎల్ఎన్ మూర్తిరావ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మహాత్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు

రాయచోటి టౌన్ : భవన నిర్మాణాల కోసం ఆన్‌లైన్ ద్వారానే అనుమతులు పొందాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ రూల్స్‌పై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు,కుప్పం, మదనపల్లె పట్టణాలలో భవన నిర్మాణాల కోసం ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకున్న వారు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మాన్యువల్‌గా ఇవ్వరాదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్‌లను క్రమబద్ధీకరించుకొనేందుకు 134 జీఓను విడుదల చేసిందన్నారు. అక్టోబర్ 24వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీకేఎం యూడీఏ ప్రణాళిక విభాగం అధికారి సంధ్య, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కేఆర్ మధు, ఏడీఎం బి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక టిప్పర్లు పట్టివేత

చాపాడు : తిప్పిరెడ్డిపల్లె సమీపంలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు. నాలుగు టిప్పర్లు ఇసుకను తరలిస్తుండగా వాటిని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభలో టీడీపీ నేతల బాహాబాహీ

- అవినీతిపై వాగ్వాదం
- సవాళ్లు, ప్రతిసవాళ్లతో దద్దరిల్లిన ప్రాంగణం


సామాజిక తనిఖీ బహిరంగ సభ ప్రాంగణంలో బాహాబాహీకి దిగిన టీడీపీలోని రెండు వర్గాలు

గుర్రంకొండ : సామాజిక తనిఖీ బహిరంగ సభా ప్రాంగణంలో టీడీపీ నేతలు ఘర్షణకు దిగారు. మండలంలోని శెట్టివారిపల్లెలో జరిగిన అవినీతిపై టీడీపీలోని రెండు వర్గాలు సభా ప్రాంగణం వద్దనే బాహాబాహీకి దిగాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోవడంతో అధికారులు హడలెత్తిపోయారు.

బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2024–25 ఏడాదికి సంబంధించి మండలంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలను అధికారులు బహిరంగంగా చదివి వినిపించారు. ఈ సందర్భంగా మండలంలోని శెట్టివారిపల్లెలో గోకులం షెడ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై టీడీపీలోని రెండు వర్గాలు గత కొన్ని రోజులుగా ఆరోపణలు చేసుకోవడంతో పాటు జిల్లా అధికారులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకొన్నారు. ఇదే విషయమై బహిరంగసభలోనూ వాగ్వాదం చేసుకొన్నారు. సదరు గ్రామానికి సంబంధించి పూర్తి వివరాలు అధికారులు చదివి వినిపించిన తరువాత అందరూ కలిసి సభ జరుగుతున్న భవనం వెలుపలికి చేరుకున్నారు. గోకులం షెడ్లలో జరిగిన అవినీతిపై ప్రశ్నించడానికి మీరెవరంటూ టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. మాపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఒక వర్గం నేతలు తిట్ల పురాణం అందుకున్నారు. దీంతో మరో వర్గం రెచ్చిపోవడంతో వాగ్వాదం పెద్దదిగా మారి అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అరుపులు, కేకలతో సభా ప్రాంగణం గందరగోళంగా మారడంతో అధికారులు హడలెత్తిపోయారు. అందరు కలసి సమావేశం నుంచి వెలుపలికి వచ్చి టీడీపీలోని ముఖ్యనాయకులు, అధికారులు రెండువర్గాల వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవినీతిపై టీడీపీ నేతలు పరస్పరం ఘర్షణ పడటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

భర్త మద్యం మానలేదని బలవన్మరణం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన రత్నమ్మ


రత్నమ్మ కుమారుడు ముని పుష్కర్ నందన్

నిమ్మనపల్లె : కులాలు వేరైనా పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది.. ఎన్నో ఆశలతో కొత్త జీవితాన్ని ప్రారంభించిన కొంత కాలానికి భర్త మద్యానికి బానిస కావడంతో, ఎలాగైనా మాన్పించాలనుకుంది.. అందుకోసం ఎన్నోసార్లు భర్తతో గొడవ పడింది.. భర్త అలవాటును మార్చలేక.. తన వాళ్ల ముందు తలెత్తుకోలేక.. తీవ్ర మనస్థాపానికి గురై ఆ అభాగ్యురాలు తనువు చాలించింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన మలిశెట్టిపల్లె వెంకటరమణ, వెంకట రమణమ్మ దంపతుల కుమార్తె ఎం.రత్నమ్మ ఎం.ఫార్మసీ వరకు చదివి, మదనపల్లె ఎన్టీఆర్ సర్కిల్‌లోని అపోలో మెడికల్ షాప్‌లో పనిచేస్తూ ఉండేది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన బల్లాపురం చంద్రశేఖర్ కుమారుడు జ్యోతి శేఖర్ తల్లిదండ్రులు మరణించడంతో అమ్మమ్మ ముని సుబ్బమ్మతో ఉంటూ డిగ్రీ వరకు చదువుకొని మదనపల్లె అపోలో ఫార్మసీలో చేరాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో కొన్నాళ్ల తర్వాత 2019 సంవత్సరంలో పెద్దలను కాదని ఇరువురు తవళం నేలమల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముని పుష్కర్ నందన్ అనే ఒకటిన్నర ఏడాది బాబు ఉన్నాడు. వివాహం అనంతరం ఇరువురు ఉద్యోగాలు మానేసి, ఇంటివద్దే ఉంటూ జ్యోతి శేఖర్ పెయింటింగ్ పనులకు వెళ్తుండగా , రత్నమ్మ స్థానికంగా పనులకు వెళ్లేది. కొంతకాలంగా జ్యోతి శేఖర్ విపరీతంగా మద్యానికి బానిస అయ్యాడు. మద్యం సేవించి ఇంటికి వచ్చిన సమయంలో భార్యతో అతిగా గొడవ పడేవాడు. ఈ క్రమంలో తరచు భార్యాభర్తల మధ్య మద్యం అలవాటు విషయమై విభేదాలు తలెత్తి గొడవపడేవారు. మూడు నెలలుగా రత్నమ్మ భర్తను నీవు మద్యం అలవాటు మానకపోతే నేను చచ్చిపోతాను అంటూ బెదిరించేది. ఈ నేపథ్యంలో మంగళవారం భర్త మద్యం సేవించి ఇంటికి రాగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. అనంతరం జ్యోతి శేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి, రత్నమ్మ ఇంటికి గడియ పెట్టి ఉండడంతో, జ్యోతి శేఖర్ కిటికీలో నుంచి లోనికి చూడగా భార్య ఉరి వేసుకొని వేలాడుతూ ఉండటం గమనించాడు. వెంటనే తలుపులు బద్దలు కొట్టి స్థానికుల సాయంతో భార్యను కిందికి దించి, వెంటనే స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్య సిబ్బంది రత్నమ్మ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఈ విషయం స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో, వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఉదయం తహసీల్దార్ తపస్విని స్థానికుల సమక్షంలో శవ పంచనామా నిర్వహించి వాంగ్మూలం రికార్డ్ చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

బినామీ వ్యక్తులు గోకులం షెడ్లు నిర్మించుకోవచ్చా?

- వీటిని మీరు ప్రోత్సహిస్తున్నారా?
- ప్రభుత్వ స్థలాల్లో గోకులం కట్టుకున్నా తప్పుకాదా?
- అధికారులను నిలదీసిన రైతులు


గోకులం షెడ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై అధికారులను నిలదీస్తున్న రైతులు

గుర్రంకొండ : అసలు లబ్ధిదారులు కాకుండా బినామీ వ్యక్తులు గోకులం షెడ్లు నిర్మించుకోవచ్చా, వీటిని మీరు సమర్థిస్తూ ప్రోత్సహిస్తున్నారా అంటూ మండలంలోని శెట్టివారిపల్లెకు చెందిన రైతులు ఉపాధిహామీ అధికారులను నిలదీశారు. ప్రభుత్వ స్థలా ల్లో గోకులం షెడ్లు నిర్మించుకోవడం తప్పు కాదా వీటిని మీరు సమర్థించడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని శెట్టివారిపల్లె, టి.రాచపల్లె గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాల ప్రస్తావన రాగానే వాగ్వాదం చెలరేగింది. శెట్టివారిపల్లెలో ఒకరి పేరుమీద మంజూరైన గోకులం షెడ్లు మరొకరు నిర్మించుకొన్నారని రైతులు ఫిర్యాదు చేశారు. అందులో ప్రభుత్వ స్థలంలో వీటిని నిర్మించుకొన్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని చోట్ల గోకులం షెడ్లను కోళ్లఫారాలుగా మార్చేశారని వారు పేర్కొన్నారు. టి.రాచపల్లెలో గోకులం బిల్లుల మంజూరులో ఉపాధిహామీ సిబ్బంది లంచాలు వసూలు చేశారని రైతు ఫిర్యాదు చేశారు. బినామీ పేర్లతో నిర్మించుకొంటే తప్పేలేదని, సమస్య ఉంటే వారే చూసుకొంటారనే ధరోణిలో జిలా ఉన్నతాధికారులు తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు మీరే తప్పులను ప్రోత్సహించడం దారుణమన్నారు. ఇలాగైతే మాకూ ఓ నాలుగు గోకులం షెడ్లు మంజూరు చేయండి మేము బినామీ పేర్లతో కట్టుకొంటామని రైతులు అధికారులను కోరారు. షెడ్ల నిర్మాణాల సమయంలోనే తాము ఎన్నోమార్లు స్థానిక ఉపాధిహామీ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేశామని అయినా వారు పట్టించుకోకుండా బినామీ వ్యక్తులకు బిల్లులు చేయడం ఎంతవరకు సబబని అధికారులను నిలదీశారు. పోరంబోకు స్థలంలో గోకులం షెడ్లు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. కనీసం గోకులం షెడ్లు నిర్మించే స్థలాలకు సంబంధించిన ఒన్‌బీ అడంగల్ కాపీలను కూడా చూడకుండా ఉపాధిహామీ సిబ్బంది ఎలా బిల్లులు చేస్తారని రైతులు నిలదీశారు. వీటిపై రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓతో ఒక కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని విచారణలో వాస్తవాలు తేలితే తదుపరి చర్యలు తీసుకొంటామని పీడీ సమాధానమిచ్చారు.

వరకట్న మరణం కేసులో పదేళ్ల జైలు శిక్ష


పోలీసుల అదుపులో సాయివర్ధన్

నందలూరు : వరకట్న మరణం కేసులో ముద్దాయి పామూరు సాయివర్ధన్‌కు రాజంపేట 3వ ఏడీజే కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నందలూరు టౌన్ బ్రాహ్మణవీధికి చెందిన పామూరి సాయివర్ధన్ తన భార్య పామూరి లక్ష్మీప్రసన్న(22)ను అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో ఆమె భర్త వేధింపులు తాళలేక 2023వ సంవత్సరం మార్చి 29వ తేదీన తన చున్నీతో ఉరి వేసుకొని చనిపోయినట్లు, మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నందలూరు ఏఎస్ఐ జేవీ సుబ్బరాయుడు క్రైం నెంబర్ 79/2023, యు/సెక్షన్ 304(బి) ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేశారు. అప్పటి రాజంపేట డీఎస్పీ జి.శివభాస్కర్‌రెడ్డి, మరో డీఎస్పీ వీఎస్‌కె చైతన్య సాక్షులను విచారించి, సాక్ష్యాధారాలను సేకరించి దర్యాప్తు చేసి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా రాజంపేట 3వ ఏడీజే కోర్టు విచారణ జరిపి ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

రేషన్ షాపులపై ఫిర్యాదులు వస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లె రూరల్ : రేషన్ షాపులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని రేషన్ షాపులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. షాపునకు స్టాక్ ఎంత వచ్చింది? పంపిణీ ఎంత చేశారు ? మిగిలిన సరుకులను తనిఖీ చేశారు. స్థానికంగా ఉన్న రేషన్ లబ్ధిదారులను రేషన్ షాపు యజమాని సమయపాలన పాటిస్తున్నారా..? సరుకులను కచ్చితమైన తూకంతో అందిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధిగా రేషన్ షాపులు తెరవాలన్నారు. 65 సంవత్సరాలకు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటివద్దనే రేషన్ ఇవ్వాలన్నారు. రేషన్ దుకాణం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీటీ ఎస్.ఫిరోజ్‌ఖాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూమన అభినయ్‌రెడ్డి



రాజంపేట : వైఎస్సార్‌సీపీ యువజన విభాగం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ (జోన్–4)గా తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్‌రెడ్డిని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అభినయ్‌రెడ్డి తిరుపతి నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా పనిచేశారు. ఈయన జోన్–4 పరిధిలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం తరపున వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పెద్దదర్గాలో ప్రార్థనలు


పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐలు, నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ ప్రతినిధులు బుధవారం పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత వారు దర్గాలోని ప్రధాన గురువులు హజరత్ పీరుల్లాసాహెబ్ మాలిక్ మజార్‌ను దర్శించుకుని ఫాతెహా చేశారు. అనంతరం దర్గాలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ మాట్లాడుతూ మృదు స్వభావి, ప్రజా నాయకుడు, సామాన్య కార్యకర్తను కూడా ఎంతో అభిమానంతో పలకరించే మిథున్‌రెడ్డిని రాజకీయ కక్షతోనే అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఎన్ఆర్ఐలతోపాటు వారి కుటుంబ సభ్యులకు తమవంతుగా తోడ్పాటు అందించిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బెయిలుపై విడుదల కావాలని దర్గా గురువులను ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యులు షేక్ గఫార్, ఎన్.సుబ్బారెడ్డి, సి.అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, ప్రధాన అధికార ప్రతినిధి షేక్ గౌస్ బాషా (చాక్లెట్) కార్పొరేటర్లు షేక్ షంషీర్, షేక్ జిలాన్ (డిష్ జిలాన్), జి. ప్రవీణ్, కుమార్‌రెడ్డి, షేక్ గయాజ్, బాబుభాయి, నాసర్, రాజాసాబ్, పీర్‌బాషా, ఫారూఖ్, అహ్మద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం, యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రెండవ రోజు బుధవారం అసోసియేషన్ నాయకులు కడప ఆర్టీసీ బస్టాండులోని ప్రధాన ద్వారం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ జరిగి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని, గవర్నర్‌పేట–2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. 8 వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని, గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంతోపాటు మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, డిపో ప్రెసిడెంట్ జయరాం, గ్యారేజ్ సెక్రటరీ మల్లేష్, డిపో జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య, సీఎస్ రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో యువకుడి గల్లంతు


నాయుని విక్రమ్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరం సమీపంలోని రెండు కుళాయిల వద్ద ఉన్న పెన్నానదిలో నాయుని విక్రమ్ (20) అనే యువకుడు గల్లంతయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. మిట్టమడివీధికి చెందిన నాయుని విక్రమ్ వన్‌టౌన్ సర్కిల్‌లోని టీ దుకాణంలో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అతను తన స్నేహితులు వెంకటసాయి, ముత్తయ్య, శివలింగమయ్యలతో కలిసి బుధవారం పెన్నానదికి వెళ్లాడు. మిత్రులందరూ పెన్నానదిలో కొంత సేపు సరదాగా గడిపారు. కొంత సేపటి తర్వాత మళ్లీ వస్తానని చెప్పి విక్రమ్ వారికి దూరంగా వెళ్లాడు. అలా వెళ్లిన అతను నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బోటు సాయంతో నదిలో గాలించారు. నీరు ఎక్కువగా ప్రవహిస్తుండటంతో విక్రమ్ ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు రోదించసాగారు. యువకుడి తల్లి రుక్మిణీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అవయవ దానం చేసి.. ప్రాణదాతగా నిలిచి..


శివరామసుబ్బయ్య (ఫైల్)

మైలవరం : అవయవ దానం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం నిర్వహిస్తారు. సరిగ్గా ఇదే రోజున వైద్యులు కల్పించిన అవగాహనతో మరణించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులు అవయవ దానం చేసి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారు. వివరాలు ఇలా.. ఈనెల 10వ తేదీన మైలవరం రిజర్వాయర్ గేట్ల వద్ద ప్రమాదవశాత్తు గోడ మీద పడిన దుర్ఘటనలో శివరామసుబ్బయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. వైద్యులు ఇచ్చిన స్ఫూర్తితో మృతుని కుటుంబ సభ్యులు కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులను దానం చేశారు.